క్లుప్తంగా

గుడిపాల ఎస్ఐ బదిలీ

గుడిపాల: గుడిపాల ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి బదిలీ అయ్యారు. తిరుపతి జిల్లా అలిపిరి పోలీస్‌స్టేషన్‌కు ఆయనను బదిలీ చేశారు. ఇక్కడి పోలీస్‌స్టేషన్‌కు ఇంకా ఎస్ఐని నియమించలేదు. కొత్త ఎస్ఐ వచ్చేంత వరకు చిత్తూరు రూరల్ వెస్ట్ సీఐ రవిశంకర్‌రెడ్డి పర్యవేక్షణలో ఏఎస్ఐ చలపతి ఇన్‌చార్జిగా వ్యవహించనున్నారు.

గ్యాస్ స్టౌ, వాటర్ క్యాన్ల వితరణ



చిత్తూరు రూరల్: చిత్తూరు మండలం అనంతాపురం అంగన్‌వాడీ కేంద్రానికి మంగళవారం గ్యాస్ స్టౌ, వాటర్ క్యాన్, చాప తదితరాలను గ్రావిటా ఫ్యాక్టరీ వితరణగా అందజేసింది. జెడ్పీటీసీ సభ్యుడు ఎంఎస్‌బాబు వీటిని అందజేశారు. గ్రావిటా జీఎం టాటాశర్మ మాట్లాడుతూ మండలంలోని 45 కేంద్రాలకు వీటిని వితరణగా అందజేసినట్లు తెలిపారు. సీడీపీఓ శ్యామ్‌సుగుణకుమారి, సూపర్‌వైజర్ కవిత, ఎంపీటీసీ సభ్యుడు సుదర్శన్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్‌ల పాలనతో ఇబ్బందులు

గుడిపాల: మండలంలోని వసంతాపురం సచివాలయంలో ఇన్‌చార్జ్ పాలన నడుస్తుంది. వీఆర్ఓ, పంచాయతీ కార్యదర్శి, వెల్ఫేర్ అసిస్టెంట్‌లు లేకపోవడంతో అభివృద్ధి పూర్తిగా కుంటుపడింది. ఇక్కడ ఉన్న వీఆర్ఓ బదిలీపై వెళ్లడంతో బొమ్మసముద్రం వీఆర్ఓ గోపిని ఇన్‌చార్జ్‌గా నియమించారు. పంచాయతీ కార్యదర్శి పురుషోత్తంరెడ్డి బదిలీపై వెళ్లడంతో ఇక్కడ కూడా ఇన్‌చార్జి కార్యదర్శిని నియమించారు. వెల్ఫేర్ అసిస్టెంట్ సుకన్యను కలెక్టర్ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం కార్యాలయానికి బదిలీ చేయడంతో ఇన్‌చార్జ్‌ల పాలన ఏర్పడింది. ఏ పనులు కూడా సక్రమంగా జరగడం లేదు. మండల కార్యాలయం కూడా ఇదే పంచాయతీలో ఉండడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. రెగ్యులర్ వీఆర్ఓ, పంచాయతీ కార్యదర్శిని నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

డిప్యూటీ సీఎంఈ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన నాగేశ్వరరావు

చిత్తూరు రూరల్: ఆర్టీసీ డిప్యూటీ సీఎంఈ (ఛీఫ్ మెకానికల్ ఇంజినీర్)గా నాగేశ్వరరావు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. చిత్తూరు ఆర్టీసీ బస్టాండులోని సీఎంఈఓ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన ఆయనను యూనియన్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. నాగేశ్వరరావు కృష్ణాజిల్లాలో డీపీటీఓగా పనిచేస్తూ ఇక్కడకు బదిలీపై రాగా..ఈ స్థానంలో పనిచేస్తున్న ఇబ్రహీం నెల్లూరు జిల్లాకు ఆపరేషన్, కమర్షియల్ డిప్యూటీ సీటీఎంగా బదిలీ అయ్యారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తులు

చిత్తూరు రూరల్: చిత్తూరు మండలం బీఎన్‌ఆర్‌పేట ఐటీఐలో మూడవ విడతగా పలు కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ సాంబమూర్తి తెలిపారు. కోపా, మెకానికల్ డీజిల్, ఎలక్ట్రీషియన్, మెకానిక్ మోటర్ వెహికల్, డీమెన్ సివిల్ కోర్సుల్లో ఖాళీలున్నాయని పేర్కొన్నారు. పదవ తరగతి పాసైనా విద్యార్థులు అర్హులన్నారు. ఆసక్తి గలవారు ఈనెల 27వ తేదీ లోపు iti.ap.gov. in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలతో ఈనెల 30వ తేదీ ఉదయం 10 గంటలకు ఐటీఐలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని ఆయన పేర్కొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో రక్తదానం

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరంలో మంగళవారం నటుడు చిరంజీవి జన్మదిన వేడుకలను అభిమానులు ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో రక్తదానం చేశారు. పేదలకు అన్నదానం చేశారు.

నెలాఖరు లోపు మామిడి మొక్కలు నాటాలి

చౌడేపల్లె: ఉపాధి హామీ పథకంలో మామిడి తోటల పెంపకానికి గుంతలు తీసిన రైతులు ఈనెలాఖరులోపు మామిడి మొక్కలు నాటడం పూర్తి చేయాలని డ్వామా ఏపీడీ సునీల్‌కుమార్ అన్నారు. మంగళవారం ఉపాధి హామీ సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రతి ఇంటి వద్ద వర్షపు నీరు భూమిలోకి ఇంకేలా ఇంకుడు గుంతలు ఏర్పాటుకు ప్రజలను చైతన్యవంతుల్ని చేయాలన్నారు. అవెన్యూ ప్లాంటేషన్, ప్రభుత్వ కార్యాలయాల వద్ద వర్షపునీటిని భూమిలోకి ఇంకే విధంగా అవసరమైన పనులు చేయడంతోపాటు ఇళ్ల వద్ద మునగ చెట్లు పెంపకం పనులు చేపట్టాలన్నారు. పనులలో కూలీల సంఖ్యను పెంచడంతో పాటు హౌసింగ్ అంచనాలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రతి గ్రామ పంచాయతీలో నిర్వహించాల్సిన రికార్డులు,ఫైలింగ్ ప్రక్రియను పరిశీలించి సూచనలిచ్చారు. సమావేశంలో ఏపీఓ శ్రీనివాసులు, జేఈ ధనుంజయుడు, సాంకేతిక సహాయకుడు అమరనాథ్, సయ్యద్‌బాషా సీఓలు ప్రసాద్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

దేశానికే ఆదర్శంగా పథకాలు

- నవరత్నాలతో ఇంటింటా సంక్షేమ లబ్ధి
- గడప గడపలో ఎమ్మెల్యే శ్రీనివాసులు



సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు కార్పొరేషన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని, నవరత్న పథకాల లబ్ధితో ఇంటింటా ఆనందాలు విరుస్తున్నా యని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం నగరంలోని 47వ డివిజన్ సంతపేటలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజాక్షేమం, అభివృద్ధి రెండు కళ్లగా ముఖ్యమంత్రి పాలన సాగిస్తున్నారని తెలిపారు. విద్య, వ్యవసాయ రంగాల్లో గతంలో ఎన్నడూ లేని అభివృద్ధి సాధించినట్లు పేర్కొన్నారు. ప్రతి ఇంటికి వివిధ పథకాలతో రూ.4 లక్షల వరకు లబ్ధి అందినట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీకి వస్తున్న ఆదరణను చూసి ప్రతిపక్షాలు ఓర్వలేకపోతున్నయన్నారు. ఈపథకాలతో పాటు మరిన్ని రావాలంటే మరోసారి జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. తొలుత కార్పొరేటర్లు జయంతి, జ్ఞానజగదీష్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. అనంతరం సచివాలయంలో ఉద్యోగులు, వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. స్థానికంగా ఉన్న ప్రధాన సమస్యలను గడపగడపకు మన ప్రభుత్వం కింద పనులకు అనుమతులు తీసుకొని పూర్తి చేయాలన్నారు. డివిజన్‌లో రోడ్లు, డ్రైనేజీ, వీధిదీపాలు వంటి సమస్యలను వేగంగా పరిష్కారించాలన్నారు. కార్యక్రమంలో మేయర్ అముద, చుడా చైర్మన్ పురుషోత్తంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రాహుల్‌రెడ్డి, మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు రాజా, కార్పొరేటర్లు చల్లాముత్తు, రెడ్డెప్ప, కోఆప్షన్ మెంబర్ కిరణ్ నాయకులు రమణ, నారాయణ, అల్తాఫ్, సీతాపతి తదితరులు పాల్గొన్నారు.

నేడు ముత్తిరేవులలో : నగరంలోని ఒకటో డివిజన్ ముత్తిరేవులలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పాల్గొంటారు. మధ్యాహ్నం 3 గంటలకు పూనేపల్లెకాలనీ నాగాలమ్మ ఆలయంలో పూజల అనంతరం కార్యక్రమం ప్రారంభం కానుంది. పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొనాలని ఎమ్మెల్యే కార్యాలయం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

వెయ్యి ఎకరాల్లో ఈ–క్రాప్ బుకింగ్



ఈ-క్రాప్ నమోదు చేస్తున్న ఏఓ వరలక్ష్మి

ఐరాల: మండలంలో వెయ్యి ఎకరాల్లో సాగుచేస్తున్న పంటలను ఈ–క్రాప్ బుకింగ్ నమోదు చేసినట్లు ఏఓ వరలక్ష్మి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ మిగిలిన 12,000 ఎకరాల నమోదును సెప్టెంబర్ 15వ తేదీ నాటికి పూర్తి చేస్తామన్నారు. మామిడి పంట, కొబ్బరితోటల సాగు ఈ–క్రాప్ ప్రక్రియ జరుగుతోందని తెలిపారు. రైతులందరూ ఈ–క్రాప్ నమోదు చేసుకోవాలని లేకుంటే ప్రభుత్వ రాయితీలు రావని తెలిపారు. ఈనెల 28వ తేదీ నుంచి ఆయా రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉంటాయని, ఆధార్ కార్డుతో సంప్రదించి ఎరువులు తీసుకోవచ్చన్నారు.

ఈ–క్రాప్ పక్కాగా చేపట్టాలి

గుడిపాల: సాగులో ఉన్న పంటలను తప్పనిసరిగా ఈ- క్రాప్‌లో నమోదు చేయాలని, ఈ ప్రక్రియను సెప్టెంబర్ 15లోగా పూర్తి చేయాలని సిబ్బందికి వ్యవసాయాధికారి మాధవి తెలిపారు. 189 కొత్తపల్లెలో మంగళవారం పంట నమోదు ప్రక్రియను ఆమె పరిశీలించారు. పంట సాగు చేసిన ప్రతి రైతుకు మేలు జరగాలంటే ఈ–క్రాప్ నమోదు అవసరమని, విపత్కర పరిస్థితులు తలెత్తినప్పుడు ఈ–క్రాప్‌లో నమోదైన పంటలనే పరిగణలోకి తీసుకొని సాయం అందిస్తారన్నారు.

ఆలయానికి యూపీఎస్ వితరణ



దాతను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

బంగారుపాళెం: మండలంలోని వజ్రాలపురం బోయకొండ గంగమ్మ ఆలయానికి నలగాంపల్లెకు చెందిన దాత యూపీఎస్ వితరణగా అందజేశారు. నలగాంపల్లెకు చెందిన గిరిధర్ మంగళవారం సాయంత్రం ఆలయ నిర్వాహకులకు యూపీఎస్ సిస్టమ్‌ను అందజేశారు. ఈ సందర్భంగా దాత గిరిధర్‌కు ఆలయ ధర్మకర్త కృష్ణప్ప, కమిటీ సభ్యులు నాగరాజగౌడ్, సుబ్బానాయుడు, శంకరయ్య, మురళి, ఆలయ మేనేజర్ మొగిలప్ప అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్రసాధాలను అందజేశారు.

7న చిత్తూరుకు సీపీఐ బస్సు యాత్ర

చిత్తూరు కార్పొరేషన్: కేంద్రం ప్రభుత్వ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టిన బస్సు యాత్ర సెప్టెంబర్ 7న జిల్లాకు చేరుకుంటుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి నాగరాజు తెలిపారు. మంగళవారం స్థానిక గాంధీ విగ్రహం వద్ద ఈమేరకు వాల్‌పోస్టర్లను విడుదల చేసి మాట్లాడారు. ఈనెల 17న విశాఖపట్నంలో ప్రారంభమైన బస్సుయాత్ర సెప్టెంబర్ 8న తిరుపతిలో ముగుస్తుందన్నారు. బీజేపీ ప్రభుత్వం మతాలు, కులాల మధ్య చిచ్చుపెట్టి తిరిగి అధికారంలో రావాలని ప్రయత్నిస్తోందని విమర్శించారు.

నేడు టంగుటూరి జయంతి

చిత్తూరు కలెక్టరేట్ : కలెక్టరేట్‌లో బుధవారం ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని నిర్వహిస్తున్నట్లు జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి రబ్బానిబాషా తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ప్రజలంతా సీఎం జగనన్న వెంటే

యాదమరి : ప్రజలంతా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ఉన్నారని, జిల్లాలో క్షేత్ర స్థాయిలో వైఎస్సార్ సీపీ బలంగా ఉందని, మొన్న జరిగిన పంచాయతీ ఎన్నికల ఫలితాలే ఇందుకు ఉదాహరణ అని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం అనంతరం ఆయన మాట్లాడుతూ టీడీపీ కంచుకోట కుప్పంలో కూడా వైఎస్సార్ సీపీ జెండా రెపరెపలాడిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో రానున్న ఎన్నికలలో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధిస్తుందనేందుకు ఇదే ఉదాహరణ అని తెలిపారు. పూతలపట్టు నియోజక వర్గంలోని కాణిపాకం, కాశిరాళ్ల పంచాయతీల్లో వార్డు స్థానాల ఎన్నికల్లో తమ మద్దతుదారులను గెలిపించుకునేందుకు టీడీపీ ఓటర్లను ఎంతగానో ప్రలోభాలకు గురిచేసినా ఓటర్లు విజ్ఞతగా వైఎస్సార్‌సీపీ బలపరచిన అభ్యర్థులను గెలిపించారని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి లభిస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేక చంద్రబాబు నాయుడు, ఆయన కుమారుడు లోకేష్, దత్త పుత్రుడు పవన్ కల్యాణ్ ప్రభుత్వంపై విషం చిమ్ముతున్నారని ఆరోపించారు. పాదయాత్రలు, సమావేశాల్లో తాము అధికారంలోకి వస్తే ప్రజలకు ఏం చేస్తామనే విషయాలు చెప్పడం లేదని విమర్శించారు.

ఘనంగా గంధోత్సవం



గంధమహోత్సవంలో పాల్గొన్న విజయానంద రెడ్డి

చిత్తూరు రూరల్: నగరంలోని కన్నయ్య నాయుడు కాలనీ, గంగనపల్లె రోడ్డులోని హజరత్ సయ్యద్ షా మొహమ్మద్ ఆరిఫుల్లా షా చిష్టియల్ ఖాదరి బాబా 53వ గంధ మహోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. చిత్తూరు ప్రభుత్వ ఖాజీ సయ్యద్‌షా మొహమ్మద్ కమాలుల్ల జహారి జునైది వారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమంలో ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి పాల్గొన్నారు. ప్రత్యేక ప్రార్థనలు అనంతరం ఆయనను ఘనంగా సన్మానించారు. అను, సయ్యద్, మస్తాన్ ఖాన్, షకీల్, అక్రంఖాన్ పాల్గొన్నారు.

బాలలతో పనులు చేయిస్తే కేసులు



స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న లేబర్ ఆఫీసర్లు

గంగవరం: బాలలతో వెట్టిచాకిరీ పనులు చేయిస్తే కేసులు తప్పవని అసిస్టెంట్ లేబర్ కమిషనర్ ఓంకార్‌రావు హెచ్చరించారు. మంగళవారం ఆయన సిబ్బందితో కలిసి గంగవరం మండలంలో ఇటుకల బట్టీలు, కోళ్ల ఫారాలు మొదలైనచోట తనిఖీలు చేశారు. 18 ఏళ్ల లోపు వారిని ఎవరూ కూడా పనుల్లో పెట్టుకోరాదని ఫ్యాక్టరీలు, ఫారాల నిర్వాహకులను ఆదేశించారు. అలా ఎవరైనా పనుల్లో పెట్టుకుంటే మాత్రం నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. రెండు రోజులు పాటు 10 మండలాల్లో దీనిపై స్పెషల్ డ్రైవ్ చేస్తామని, ఎక్కడైనా బాలలతో పనులు చేయిస్తున్నట్టు తమ దృష్టికి వస్తే మాత్రం చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో లేబర్ ఆఫీసర్ మధుబాబు, రెవెన్యూ, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో మెరుగైన వైద్యసేవలు



గుడిపాల: వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ రష్మిత



పూతలపట్టులో..



తవణంపల్లెలో..

గుడిపాల: ఫ్యామిలీ డాక్టర్ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని బొమ్మసముద్రం వైద్యాధికారి రష్మిత అన్నారు. మండలంలోని కుప్పిగానిపల్లెలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వివిధ వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులను అందజేశారు. అనంతరం ఇంటివద్ద మంచాన పడ్డ రోగుల వద్దకు వెళ్లి కావాల్సిన వైద్యసేవలను అందజేశారు. గర్భిణులు, బాలింతలకు వైద్యసేవలు అందించి పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. వైద్యసిబ్బంది శ్రీలక్ష్మి, సరిత, సరస్వతి, కిరణ్‌కుమారి, శివగామిలు పాల్గొన్నారు.

ఫ్యామిలీ ఫిజీషియన్‌కు విశేష స్పందన

పూతలపట్టు: మండలంలోని ఎం.బండపల్లి పంచాయతీ వడ్డివానికండ్రిగలో మంగళవారం నిర్వహించిన ఫ్యామిలీ ఫిజీషియన్‌కు విశేష స్పందన లభించింది. చిత్తూరు అపోలో వైద్య కళాశాల విద్యార్థులు సేవలు అందించారు. మండల వైద్యాధికారి అరవింద్ బాలింతలు, గర్భిణులను పరీక్షించి మందులను అందజేశారు. పలు సూచనలను అందజేశారు. బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు మందులు అందజేశారు. 45 మంది రోగులకు పరీక్షలు చేసి మందులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్యామిలి ఫిజిషియన్ కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోందని, ఎవరికైన మెరుగైన వైద్యసేవలు అవసరమైతే వారిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సిఫారసు చేస్తున్నట్లు తెలిపారు. అవసరమైతే సీహెచ్‌సీ, ఏరియా ఆస్పత్రులు, జిల్లా ఆసుపత్రులకు పంపిస్తామని పేర్కొన్నారు. హెల్త్ ఆఫీసర్ శ్రీనివాసమూర్తి, ఎంఎల్‌హెచ్‌పీ దయాకర్‌రెడ్డి, ఏఎన్ఎం అంజలి, అపోలో సిబ్బంది గౌతమి పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

తవణంపల్లె: గర్భిణులు రక్తహీనత రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని, పౌష్టికాహారం తప్పనిసరని మండల వైద్యాధికారి ప్రియాంక తెలిపారు. మంగళవారం మండలంలోని బాపినాయుడుపల్లెలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారి 55 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. 104 మొబైల్ క్లినిక్‌లో గర్భిణులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. గర్భిణులు నెలా నెలా పరీక్షలు చేయించుకోవాలన్నారు. ప్రభుత్వా స్పత్రిలో ప్రసవం తల్లీబిడ్డకు శ్రేయస్కరమని తెలిపారు. తాజా ఆకుకూర లు, కూరగాయలు తీసుకోవాలని సూచించారు. పరిశుభ్రతతో వ్యాధు లను అరికట్టవచ్చునని తెలిపారు. ఆరోగ్య కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలి

ఐరాల: ఫ్యామిలీ డాక్టర్‌లో అందిస్తున్న మెరుగైన వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారి పూర్ణలత తెలిపారు. మంగళవారం మండలంలోని పీఎస్ అగ్రహారంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వైద్య శిబిరంలో డాక్టర్ 65 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. ఇళ్లకే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని మందులు అందజేసి సలహాలు ఇచ్చారు. హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



ఐరాల: వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ పూర్ణలత

అర్హతే ప్రామాణికంగా పథకాల లబ్ధి



పెరుమాళ్లపల్లెలో పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, పక్కన జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డి

- అందరికీ జగనన్న సంక్షేమ పథకాలు
- పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

యాదమరి: పార్టీలు, కులాలు, మతాలకతీతంగా పథకాల లబ్ధిని అందిస్తున్నట్లు పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు తెలిపారు. జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డితో కలసి మంగళవారం యాదమరి పంచాయతీలోని పెరుమాళ్లపల్లె, యాదమరి, వేణుగోపాల పురంలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి పథకాల లబ్ధిని వివరించే సంక్షేమ బావుటా బుక్‌లెట్లు అందించారు. అనంతరం మాట్లాడుతూ జగన్‌మోహన్ రెడ్డి పాదయాత్రలో అన్ని వర్గాల సమస్యలను కళ్లార చూసి అధికారంలోకి రాగానే నవరత్నాల పథకాలను అమలు చేశారని తెలిపారు. వివిధ పథకాల ద్వారా ప్రతి ఇంటికీ రూ.4లక్షల వరకు లబ్ధి అందిందని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్ సీపీని ఆదరించాలని కోరారు. స్థానికులు విన్నవించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

అధికారులు చాల నిర్లక్ష్యంగా ఉన్నారు..

ప్రభుత్వం అందిస్తున్న ఫలాలు ఎవ్వరు ఇస్తున్నారని లబ్ధిదారులను ప్రశ్నించగా సరైన సమాధానాలు రాక పోవడంతో సచివాలయ సి బ్బంది, వలంటీర్లపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పార్టీలకతీతంగా అర్హులందరికీ పథకాలు ఇస్తుంటే లబ్ధిదారులకు తెలియజేయక పోవడం ఏమిటని ప్రశ్నించారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం కావడం లేదని హౌసింగ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీపీ సురేష్‌బాబు, ట్రాన్స్‌కో ఏడీ కొండయ్య, తహసీల్దార్ హనుమంతు, ఎంపీడీఓ శివరాజ్, వ్యవసాయశాఖ ఏఓ చరిత రెడ్డి, ఎంఈఓ రుక్మిణీ, సర్పంచ్ ఝాన్సీ, నాయకులు నాగేశ్వర్ రెడ్డి, మనోహర్ రెడ్డి, మనోహరన్, సురేంద్ర రెడ్డి, పరందామ గౌడ్, పెరుమాళ్ల పల్లె గ్రామ పెద్ద చంద్ర శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సింగిల్‌విండో మాజీ డైరెక్టర్ వైఎస్సార్‌సీపీలో చేరిక



మొగిలీశ్వర్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

బంగారుపాళెం: మండలంలో చీకూరుపల్లెకు చెందిన టీడీపీ నాయకుడు, సింగిల్‌విండో మాజీ డైరెక్టర్ మొగిలీశ్వర్ మంగళవారం పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయనకు ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం మొగిలీశ్వర్ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితుడై వైఎస్సార్‌సీపీలో చేరినట్లు తెలిపారు. పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానన్నారు.

పనుల నాణ్యతలో రాజీ వద్దు



పనులను పరిశీలిస్తున్న మేయర్ అముద

చిత్తూరు అర్బన్ : అభివృద్ధి పనుల్లో నాణ్యత విషయంలో ఎక్కడా కూడా అధికారులు రాజీ పడొద్దని చిత్తూరు మేయర్ అముద ఆదేశించారు. నగరంలోని 39వ వార్డు పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను మేయర్ మంగళవారం పరిశీలించారు. గోకులం వీధిలో గడప గడపకు ప్రభుత్వ నిధుల నుంచి రూ.5 లక్షలు వ్యయంతో జరుగుతున్న సీసీ కాలువ నిర్మాణ పనులను పరిశీలించారు. నిర్మాణ పనులు నాణ్యతగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నిర్దేశిత కాలంలోపు పనులు పూర్తి చేయాలన్నారు. మిగిలిన పనులు వేగంగా ప్రారంభించి పూర్తి చేయించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

చిత్తూరు కలెక్టరేట్: ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అందిపుచ్చుకొని విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యుడు డాక్టర్ రాజేంద్రప్రసాద్ అన్నారు. మంగళవారం ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఏదైనా సమస్యలు ఉంటే రాష్ట్ర బాలల హక్కుల కమిషన్‌కు తెలియజేస్తే తక్షణం పరిష్కరిస్తామని తెలిపారు. పేద విద్యార్థుల ఆర్థిక ఉన్నతికి, విద్యాభివృద్ధికి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. తొమ్మిదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినిని కుర్చీలో కూర్చోబెట్టి అందరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. విద్య ఒక్కటే మనిషికి గౌరవాన్ని, ఉన్నత స్థాయిని అందజేస్తుందని సూచించారు. అనంతరం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆయనను ఐసీడీఎస్ పీడీ నాగ శైలజ, ఏఎస్పీ సుధాకర్ మర్యాద పూర్వకంగా కలిశారు. గిరిజన పాఠశాల ప్రిన్సిపల్ రేఖ, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ శివశంకర్, నాన్ ఇన్‌స్టిట్యూషనల్ కేర్ ప్రొటెక్షన్ ఆఫీసర్ శివ శంకర్ పాల్గొన్నారు.

● కాణిపాకంలో వర్షం



కాణిపాకం పరిసరాలలో కురుస్తున్న వర్షం



ఆలయ సమీపంలో కురుస్తున్న వర్షం

కాణిపాకంలో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురవడంతో వేడి నుంచి భక్తులు కాస్త ఉపశమనం పొందారు. ఉదయం నుంచి సూర్యుడి ప్రభావంతో వేసవిని తలపించింది. దీంతో భక్తులు కాస్త ఇబ్బంది పడ్డారు. కానీ వరుణుడు సాయంత్రం కరుణించడంతో మోస్తారు నుంచి భారీ వర్షం కురిసింది. అలాగే పరిసర గ్రామస్తులు వేరుశనగ పంటలకు ఈ వర్షంతో కొంతమేర బలం చేకూరుతుందని రైతులు హర్షం వ్యక్తం చేశారు.

-కాణిపాకం(యాదమరి)